అయ్యప్పలకు నిత్యాన్నదానం



మణికొండ: గత కొన్నేళ్ల నుంచి అయ్యప్పలకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పుప్పాల్‌గూడ కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో సోమవారం ప్రారంభించారు. నవంబర్ 24వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని గురుస్వామి, అన్నదాన ప్రభువు కస్తూరి రాములు ముదిరాజ్ ప్రకటించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని అయ్యప్ప మాలాధారులు మధ్యాహ్నం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీలో గత కొన్నేళ్లుగా రోడ్లకు ఇరువైపుల వ్యాపారులు పక్కా డబ్బాలను ఏర్పాటు చేసుకుని కబ్జాకు యత్నిస్తున్నారని, ప్రజావాణిలో వీరాంజనేయ దేవాలయ కమిటీ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లకు ఇరువైపుల డబ్బాలు వేసి కబ్జా చేస్తున్నారన్నారు. కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, మధుబన్ కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారి కంకర తేలడంతో బస్సులు ఒక రూట్‌లోనే వస్తున్నాయన్నారు. గతంలో రెండు రూట్లలో బస్సులు తిరిగేవని ప్రస్తుతం రోడ్లు దెబ్బ తినడంతో ఒక రూట్‌లోనే వస్తున్నాయని వివరించారు. కాలనీల్లో పర్యటించి తమ సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు గోవింద్‌రాజ్, కిషోర్, దిలీప్‌భరత్, ఉదయ్‌రావు, అనిల్‌రెడ్డి తదితరులున్నారు.

ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తున్నాం..



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణిలో ఆక్రమణల తొలగింపు, రోడ్లపై రెండు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

'మినీ ఇండియా' శేరిలింగంపల్లి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గం 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందిందని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నానక్‌రాంగూడలోని హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో అత్యధికంగా నార్త్ ఇండియన్స్, ఐటీ ఉద్యోగులు ఉంటారని, ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సభ్యత్వం స్వీకరించేలా చూడాలని సూచించారు. శేరిలింగంపల్లిలో 8 లక్షల ఓటర్లు ఉన్నారని పార్టీ కార్యకర్తలు, నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నానక్‌రాంగూడలో దుకాణాలకు వెళ్ళి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో రఘునందన్‌రావుతోపాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: వైద్యుల సేవలు వెలకట్టలేనివని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. దశాబ్దానికి పైగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావుకు ఆయన ఉత్తమ సేవా అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యుల జీవితాలు రోగుల సేవకే అంకితమని అన్నారు. పేదలకు సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఏరియా ఆసుపత్రిలో సేవలు బాగా మెరుగు అయ్యాయని ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఎంతో చేయూతనిచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రమ్య, గోల్కొండ శ్రీ మహంకాళీ ఆలయ పూజారి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



మహమ్మద్ జాహుర్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన షాహిన్‌బేగం, మహమ్మద్ జాహుర్(50)లు భార్యభర్తలు. కాగా వీరికి ఇద్దరు సంతానం. గత కొద్ది రోజుల క్రితం మహమ్మద్ జాహుర్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. మతి స్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈనెల 8న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను విచారించిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్ !

◆ తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు ◆ ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

రోడ్లపై పగిలిన మ్యాన్‌హోళ్లతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకేమీ సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, బాబుల్ రెడ్డినగర్‌కు మధ్యలో ఉన్న రోడ్డుపై సుమారు 10 మ్యాన్‌హోల్స్ పగిలిపోయాయి. అటు నుంచి కార్లు, ఇతర వాహనాలు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాలు పడి వాహనదారుడికి గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి.



బాబుల్‌రెడ్డినగర్ రోడ్డుపై..



మార్కండేయనగర్‌లో..

డ్రెయిన్‌లోకి డ్రైనేజీ పైపులైన్..

- గత పదేళ్ల క్రితం బాబుల్‌రెడ్డినగర్ నుంచి మార్కండేయనగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను నిర్మించారు. ఆ డ్రైన్‌లోకి కాలనీలో ఉన్న ప్రతీ ఇంటి డ్రైనేజీ పైపులైన్‌ను ఆ డ్రెయిన్‌లోకి కలిపారు.
- జీహెచ్ఎంసీ నుంచి డ్రైనేజీ వ్యవస్థను జలమండలికి అప్పగించారు. కాలనీలో డ్రైనేజీ పొంగినప్పుడల్లా కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా డ్రైనేజీ సమస్య తమది కాదని, జలమండలి అధికారులు వెనుదిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలున్నాయి. జలమండలి అధికారులు కొత్త మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పదేళ్ల క్రితం ఏర్పాటు చేసినవి..



పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ కవర్లతో రెండు డిపార్టుమెంట్ల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మ్యాన్‌హోల్స్ లోపల ఉన్నది మురుగునీరు అని జలమండలి అధికారులు గ్రహించాలి. చిన్న సమస్యను పెద్దగా చేసి మాకు రాదని, పారిపోవడం సరికాదు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పగిలిన మ్యాన్‌హోళ్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– మామిడిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ నేత

కొత్త మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేయిస్తా..



వర్షపు నీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన డ్రెయిన్‌లోకి మురుగు నీటి పైపులైన్ కలిపారు. మ్యాన్‌హోల్స్‌పై కవర్లు ఏర్పాటు చేస్తాం. మురుగు సమస్య పరిష్కారానికి జలమండలి సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– నరేందర్‌గౌడ్, సర్కిల్ ఈఈ

నిండుకుండలా ఎర్రకుంట చెరువు



బండ్లగూడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు నిండుకుండలా మారుతున్నాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లోని ఎర్రకుంటలో 6 ఫీట్ల లోతు వరకు కుంట పరిమాణం పొడవు, వెడల్పులు తవ్వడంతో ఈసారి నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ఎండాకాలం నీటి కొరత చాలా తక్కువగా ఉండొచ్చని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. గతంలో కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి చొరవతో ఎర్రకుంట చెరువు వద్ద అభివృద్ధి పనులను చేపట్టడంతో ప్రజలకు మరింత ప్రయోజనం కలగనుంది. ఎర్రకుంటలో నీరు నిలవడం వల్ల భాగ్యనగర్ కాలనీకే కాకుండా చుట్టు ఉండే కాలనీలు, హైదర్షాకోట్ గ్రామానికి నీటి సమస్య ఉండదని కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు

గోల్కొండ: సేవా కార్యక్రమాలు చేసే వారిని సమాజం తప్పకుండా గుర్తిస్తుందని ఎఫ్‌టీపీసీ అధ్యక్షులు జంగ చైతన్య అన్నారు. గత 15 సంవత్సరాలుగా నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించి అభినందించారు.కార్యక్రమంలో ప్రముఖ టాలీవుడ్ నటుడు సుమన్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు నేమ్‌సింగ్ ప్రేమి తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీలు తీసుకుంటూ.. సందడి చేస్తూ..

గోల్కొండ: గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం వేలసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో జాతరను తలపించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం 7 గంటలకే కోటకు చేరుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్ కౌంటర్ ముందు భారీ క్యూ ఏర్పడింది. పిల్లలు, పెద్దలు కోటలోకి ప్రవేశించి ప్రహరీలు, ఫౌంటేన్, ఫిరంగుల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అక్కడ ఉన్న హిస్టరీ గైడ్స్ వారికి ప్రవేశ ద్వారం పైభాగాన ఉన్న క్లాపింగ్ పోర్టికో విశేషాలను వివరించారు. ఇక్కడ చప్పట్లు కొడితే కోటపై భాగంలో కొలువుదీరిన రాజుకు వినపడేదని వారు వివరించగా పర్యాటకులు ఆనాటి సాంకేతిక పరిజ్ఞానానికి ఆశ్చర్యచకితులయ్యారు. కుతుబ్‌షాహీ రాజుల కాలంనాటి ఆయుధాలు భద్రపరిచిన శిలాఖానా సందర్శనకు పోటీపడ్డారు. అక్కడ భద్రపరచబడిన సుమారు 500 సంవత్సరాల నాటి వివిధ రకాల ఆయుధాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. రాణిమహల్, అక్కడ ఉన్న ఫౌంటేన్ చూస్తూ పర్యాటకులు మెట్ల మార్గాన గోల్కొండ పైభాగానికి వెళ్లి అక్కడ కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. మార్గమధ్యలో శ్రీరాముడి పరమభక్తుడైన భక్త రామదాసును కుతుబ్ షాహీ రాజు బంధించిన చెరసాలను కూడా పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.

అమలు కాని హామీలతో మోసం !



కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా పాటను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అత్తాపూర్: అమలు కాని నిర్ణయాలతో తెలంగాణ ప్రజలను ప్రలోభాలకు ఒకవైపు మభ్యపెడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు చీదరించుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖస్తష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి శ్రీనగర్ కాలనీలోని కార్తీక్‌రెడ్డి నివాసంలో ఆయన పేరుపై రూపొందించిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలు ఆలోచనలకు పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారం ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండానే పేదలు, మధ్య తరగతి కుటుంబాలు నిర్మించుకున్న పక్కా నిర్మాణాలను హైడ్రా పేరుతో నేలమట్టం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జీవిస్తున్నామా.. అని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ మరింతగా చేరువయ్యేందుకు యువకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు నాగరాజు, రాముయాదవ్, రఘు అశోక్‌కుమార్, శ్రీపాల్, వెంకటేష్, శశికాంత్, దామోదర్, సంగీత్, రాజు తదితరులున్నారు.

ప్రజలతో ఉండి సమస్యల పరిష్కారం...



కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న రావుకోళ్ల నాగరాజు

బండ్లగూడ: ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రావుకోళ్ల నాగరాజు సోమవారం కార్తీక్‌రెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌తో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: పలు కాలనీల్లో దీర్ఘకాలిక సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే ఇంజినీరింగ్ అధికారులను కాలనీల వారీగా పంపి వచ్చే మున్సిపల్ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పందెన్వాగుపై స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద వంతెన ఎత్తు పెంపు పనులను చేపట్టాలని ది సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్, సంయుక్త కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ



రాయదుర్గం: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్‌లాల్ సోమవారం పరిశీలించారు. రాయదుర్గం వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న యూపీహెచ్‌సీ పనితీరు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా, వైద్య సేవలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


అక్ష 'రాళ్ల' బడి

హెచ్‌సీయూ, మనూ యూనివర్సిటీల్లో హెరిటేజ్ రాక్స్


'పత్థర్ కే దిల్.. ఏక్ తా మే తాకత్ హై.. అనేక్ తా మే ఏకతా.. 'మష్రూమ్ రాక్,.. వైట్ రాక్స్.. టెంపుల్ రాక్'లు హెరిటేజ్ రాక్స్‌గా గుర్తింపు పొందాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన భారీ బండరాళ్లకు పెట్టిన పేర్లు ఇవి. నగరంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న రాతి సంపద హెచ్‌సీయూ, మనూ ఉర్దూ యూనివర్సిటీల్లో ఉండడం విశేషం. నగరంలో గుర్తించిన హెరిటేజ్ రాళ్లలో హెచ్‌సీయూ 'మష్రూమ్‌రాక్' ఉంది. వీటికి శతాబ్దాల చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. వీటి గురించి భావితరాలకు తెలిసేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌సీయూలో 2,300 ఎకరాలు, 'మనూ'లో 200 ఎకరాలు కలిపి 2,500 ఎకరాలలో విభిన్న తరహాలో ఏర్పడిన భారీ బండరాళ్ల (రాక్స్)ను రక్షిస్తూ వస్తున్నారు.

-రాయదుర్గం

హెచ్‌సీయూలో ప్రభుత్వం గుర్తించిన హెరిటేజ్ రాక్ 'మష్రూమ్ రాక్'



- రాక్ సొసైటీ గుర్తింపు పొందిన ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పత్థర్ కే దిల్, ఏక్‌తా మే తాకత్ హై పేర్లు కలిగిన రెండు బండరాళ్లకు మాత్రం 2500 మిలియన్ల ఏళ్ల చరిత్ర ఉందని, దక్కన్ పీఠ భూముల్లో భాగం అని చెబుతున్నారు. ముఖ్యంగా నాలుగు బండరాళ్లలో రెండు రాళ్లు పక్కపక్కనే ఉండడాన్ని గుర్తించి ఈ రాళ్లకు 'పత్థర్‌కే దిల్' అని నామకరణం చేశారు. రాళ్లన్నీ ఒకేచోట ఉండడంతో ఏక్‌తా మే తాకత్ హై (యునైటెడ్ వి స్టాండ్) అని నామకరణం చేశారు. అలాగే మరోచోట ఉన్న రాళ్లకు కూడా అనేక్ తా మే ఏక్‌తా (యూనిటీ ఇన్ డైవర్సిటీ) అని కూడా పిలుస్తున్నారు.




హెరిటేజ్ రాక్‌గా నగరంలో గుర్తింపు పొందిన మనూలోని పత్థర్ కే దిల్



ఉర్దూ విశ్వవిద్యాలయంలో..

రాక్స్ పేరిట వీకెండ్స్ వాక్

- విభిన్న రాష్ట్రాలు, భాషలు, కులాలు, మతాలకు చెందిన వారితో మినీ భారత్‌గా మారిన హెచ్‌సీయూలో విద్యార్థులలో ఐక్యత బలపడేలా చేసేందుకు హెచ్‌సీయూ ఎక్స్‌ప్లోరర్ పేరిట వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు ద్వారా వీకెండ్స్‌లో వాక్‌లను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో మష్రూమ్ రాక్, వైట్ రాక్, టెంపుల్ రాక్, వర్జిన్ రాక్, వైట్ రాక్స్, హైరాక్స్, సాసర్ రాక్, కోన్ రాక్ కాంప్లెక్స్ ఇలా రకరకాల పేర్లతో ఈ బండరాళ్లను విద్యార్థులు పిలుస్తుంటారు.



హెచ్‌సీయూలో రాక్స్ వాక్



హెచ్‌సీయూలోని పురాతన రాతితో ఓ విద్యార్థి తయారు చేసిన హెచ్‌సీయూ సింబల్



యూనిటీ ఇన్ డైవర్సిటీ- 'అనేక్ తా మే ఏకతా' పేరుతో భారీ రాళ్లు

కాశీ విద్యాపీఠంతో 'మనూ' ఒప్పందం



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోమవారం వారణాసి మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠం (ఎంజీకేవీపీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ముఖ్యంగా విద్యావేత్తలు, పరిశోధన, సలహాలు, శిక్షణ, జ్ఞానాన్ని పంచుకోవడం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, విద్యార్థుల మార్పిడి, రెండు సంస్థలలో ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణపై ఒప్పందం చేసుకున్నారు. 'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్‌త్యాగి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు ఉంటుంది. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సయ్యద్ నజాముల్ హసన్, మహ్మద్ ఫరియాద్, సల్మా అహ్మద్ ఫారూఖీ, సనీమ్‌ఫాతిమా పాల్గొన్నారు.

నేడు ,రేపు వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు ఉర్దూ రచయితల వర్క్‌షాప్ జరగనుంది. ఉర్దూ ఉన్నత విద్య కోసం పాఠ్య పుస్తకాలను అభివృద్ధి చేయడానికి, అకడమిక్ రైటింగ్‌పై ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.నూతన విద్యావిధానం -2020కి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, భారతీయ భాషా సమితి (బీబీఎస్) ద్వారా చొరవ తీసుకుంది. మనూ నోడల్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. మంగళవారం ఉదయం 11 గంటలకు 'మనూ'లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, యూజీసీ కార్యదర్శి, ఉస్మానియా మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సులేమాన్ సిద్దిఖీ, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం ప్రొ.ఇంతియాజ్ హసన్ పాల్గొంటారు.